సాక్షి
బాపట్ల
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



తురకపాలెంలో డీపీవో పర్యటన

గుంటూరురూరల్: వరుస మరణాలు సంభవించిన గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామాన్ని డీపీవో నాగసాయికుమార్ మంగళవారం సందర్శించారు.



ఓజోన్ దినోత్సవ ర్యాలీ

రొంపిచర్ల: విప్పర్ల దళితవాడలోని ఎంపీపీ (ఎస్) పాఠశాలలో మంగళవారం ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఓజోన్ దినోత్సవ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.



ఖైదీలకు ఎయిడ్స్‌పై అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా కారాగారంలో ఖైదీలకు మంగళవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ఐసీటీసీ (కౌన్సిలర్) శ్రీనివాసరావు అవగాహన సదస్సు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నాగార్జున కొండను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



విజయపురిసౌత్: పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ మంగళవారం సందర్శించారు. మ్యూజియంలో బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, బోధి వృక్షాన్ని సందర్శించారు. అనంతరం సాగర్ డ్యామ్‌ను తిలకించారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ డీటీ బాషా, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓ రవికుమార్ తదితరులు ఉన్నారు.

స్త్రీ శక్తి పథకాన్ని బాధ్యతతో స్వీకరించండి



మంగళగిరి టౌన్ : స్త్రీశక్తి పథకాన్ని బాధ్యతతో స్వీకరించి పని చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు సిబ్బందికి సూచించారు. మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం బస్టాండ్, గ్యారేజ్‌లో అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు చెంగలరెడ్డి, అప్పలరాజు, నాగేంద్ర ప్రసాద్, విమల, జాన్ సుధాకర్ ఇతర జోనల్ అధికారులు, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



పెదకాకాని: పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ దసరా మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గుంటూరులోని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కార్యాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్లు, బుక్‌లెట్‌లను ఆలయ ఉపకమిషనరుతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ఉప ప్రధాన అర్చక పేటేటి ధనమహేశ్వర ప్రసాదు, కార్యాలయ సిబ్బంది, పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పెంట్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై మంగళవారం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జయంతి నిర్వహించారు. తొలుత దేవస్థానం సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం యాయవరం సంపూర్ణ రాజ్యలక్ష్మీ కర్ణాటక సంగీత గాత్ర కచేరి చేపట్టారు. సరసుడు, గణేష్ పంచరత్నం, శ్రీమన్నారాయణ, సభాపతి, రామా నను బ్రోవరా, శంభో మహాదేవ, మినవ్యాల, స్వరజతి, భోగేంద్ర, డోలాయం వంటి అలరించిన స్వరాల కచేరి అలరించింది. మృదంగంపై సూర్యహరినాథ్, సాయిశ్రీధర్, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకులు గుళ్లపల్లి సుబ్బారావు, గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి వై.శేషురాణి, సేవా సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ తప్పులను తప్పుగా పత్రికలు ఎత్తిచూపడాన్ని పాలకులు ఓర్చుకోలేకపోతున్నారు. ప్రజాస్వామ్యంలోని నాలుగో స్తంభంగా పరిగణింపబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మాజీ ఎమ్మెల్యే,మంగళగిరి



వాస్తవాలు రాస్తే కేసులు పెడతారా?



కూటమి ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలు, అవినీతి గురించి వాస్తవాలు రాస్తే 'సాక్షి'పై అక్రమ కేసులు పెడతారా..? ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా నీచ సంస్కృతికి కూటమి సర్కారు నాంది పలుకుతోంది. విలేకరుల సమావేశంలో టీడీపీ నేతల అక్రమాల గురించి మాట్లాడితే.. పత్రికపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ.. రాజ్యాంగ విలువలను కూటమి పాలకులు కాలరాస్తున్నారు. తెలుగు ప్రజలకు రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను వివరించటమే విలేకరులు చేసిన తప్పా? కూటమి ప్రభుత్వ వ్యవహారశైలి చూస్తుంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. నిజాలు నిర్భయంగా చెపుతూ, ప్రభుత్వ అక్రమాలను ప్రజలముందు పెట్టే 'సాక్షి'ని పాత్రికేయులను నిలువరించలేరు.

– షేక్ నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ, గుంటూరు నగర అధ్యక్షురాలు

మగ్గం మూగబోయింది

నాడు అగ్గిపెట్టెలో ఇమిడిపోయే ఆరు మూరల చీర నేసిన మన చేనేత వైభవం, విశిష్టత.. సముద్రాలు దాటి విస్తరించగా.. నేడు నేతన్నల జీవితాలు కష్టాల కడలిలో చిక్కుకున్నాయి. నాడు దేశమంతటికీ వస్త్రాలు అందించిన నేతన్న .. నేడు భుక్తి కోసం ఇతర పనులు వెదుక్కొనే దుస్థితి దాపురించింది. ఈ దశలో చేనేతకు చేయూతనందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండిచేయి చూపడంతో నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సర్కారు నుంచి రావాల్సిన మొండి బకాయిలు చేనేత సొసైటీల ఉసురు తీస్తున్నాయి. ఈక్రమంలో నిత్యం మగ్గాల సవ్వడితో సందడిగా ఉండే చేనేత కాలనీల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

కష్టాల కడలిలో నేతన్న

- మూసివేత దిశగా చేనేత సొసైటీలు
- పేరుకు పోయిన బకాయిలు
- జిల్లాలో సొసైటీలకు రూ.2.50 కోట్ల బకాయి
- నాడు నేతన్న నేస్తం ద్వారా ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రూ.కోట్ల బకాయిలు సైతం చెల్లించిన వైనం
- కూటమి ప్రభుత్వంలో నీటిపై రాతలుగా హామీలు
- ఇంతవరకు అమలు కాని ఉచిత విద్యుత్ హామీ

వేటపాలెం: పవర్ లూమ్స్ రాకతో ఒక వైపు చేనేత రంగం పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోగా, మరోవైపు మరమగ్గాలతో తయారు చేసిన పట్టు చీరలు విచ్చలవిడిగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దీంతో చేనేత రంగం కాలానికి ఎదురు నిలిచి పోరాడుతోంది. ఆదుకుంటాయని భావించిన చేనేత సొసైటీలు మూతబడుతున్నాయి.

సొసైటీలపై బకాయిల బండ

గడిచిన 15 నెలల్లో చేనేత సహకార సంఘాలకు బకాయిలు విడుదల చేయకపోడంతో అవి మూతపడే దుస్థితి ఏర్పడింది. ఫలితంగా చేనేతలు చేతిలో చిల్లిగవ్వ లేక అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ తిప్పలు పడుతున్నారు. చేనేతను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాల భవిష్యత్ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని రేపల్లె, భట్టిప్రోలు, చీరాల, ఈపురుపాలెం, జాండ్రపేట, వేటపాలెం, పందిళ్లపల్లి, బేస్తవారిపేట, ఈదుమూడి, వలపర్ల, ప్రాంతాల్లో దాదాపు పది వేల మంది చేనే తపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 72 వరకు చేనేత సొసైటీలు ఉండేవి. అవి నేడు 35 మాత్రమే మిగిలాయి.



ఇవి కూడా మూసివేత దశకు చేరుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న సొసైటీలకు గడిచిన రెండేళ్లగా రూ.2.50 కోట్ల వరకు బకాయిలున్నాయని పాలక వర్గాలు చెబుతున్నాయి. వీటితో పాటు ప్రతి ఏడాది పండగలకు ఇచ్చే ప్రత్యేక రిబేటు 20 శాతం సైతం అందడం లేదు. 20 శాతం యారన్ సబ్సిడీ నిలిచి పోయిందంటున్నారు. గడిచిన కాలానికి మార్కెట్ ఇన్‌సెంట్ రావాల్సి ఉంది.

పెట్టుబడులు పెట్టే స్తోమత లేక..

ఇప్పటికే ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకు పోవడంతో చేనేత సహకార సంఘాలు మూత పడేస్థితికి చేరుకున్నాయి. సంఘాలపై ఆధార పడిన చేనేత కార్మికులు ఇతర పనులకు వెళ్లిపోతున్నారు. పెట్టుబడులు పెట్టే స్థోమత లేక నేత పనులు వదిలేశారు. ముడి నూలు కొనుగోలు సమయంలో చేనేత కార్మికులు 5 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారు. ఈ కారణంగా చీరల ధరలు పెంచడంతో మార్కెట్ విక్రయాలు మందగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 5 శాతం జీఎస్టీ చెల్లిస్తామని ప్రకటించింది. ఈ విషయంలో కూడా సర్కార్ మోసగించిందని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత విద్యుత్ ఏదీ?

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు 200 యూనిట్‌ల వినియోగం వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇందుకు భిన్నంగా సెప్టెంబర్ నెలలో రూ.వేల విద్యుత్ బిల్లులు తమ చేతిలో పెట్టారని చేనేత కార్మికులు వాపోతున్నారు. ఉచిత విద్యుత్ పథకం అమలు చేయక పోవడంతో ఏడాదిగా సుమారు రూ.2 కోట్ల రాయితీని కార్మికులు పోగొట్టుకున్నారని చేనేత సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో, నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమకు నేతన్న నేస్తం ద్వారా ఠంఛనుగా ఏడాదికి రూ.24వేలు జమ చేశారని, కోట్ల రూపాయిల సొసైటీల బకాయిలు సైతం చెల్లించారని నేతన్నలు గుర్తు చేసుకుంటున్నారు.

బకాయిలు విడుదల చేయాలి



చేనేత సహకార సంఘాలు నిర్వీర్యం అవుతున్నాయి. వెంటనే సహకార సంఘాలు, ఆప్కో పాలక మండళ్లను నియమించాలి. ఎన్నికలు నిర్వహించాలి. చేనేత సొసైటీ బకాయిలు వెంటనే విడుద చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.70 కోట్ల బకాయిలు చెల్లించి చేనేతను ఆదుకున్నారు. అంతేకాకుండా నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకొన్నారు. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం అమలు చేయాలి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జీఓకే పరిమితం చేయకుండా వెంటనే అమలు చేయాలి.

– బీరక సురేంద్ర, దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పందిళ్లపల్లి

సొసైటీలు మూత పడుతున్నాయి



బకాయిలు విడుద చేయకుంటే సొసైటీలు మూసివేసే పరిస్థితి ఉంది. సొసైటీలు మనగడ సాగించేందుకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ప్రొక్యూర్‌మెంట్ కూడా సక్రమంగా జరగడం లేదు.

– కర్ణ లక్ష్యారావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు, దేశాయిపేట

పోలీసు బందోబస్తుతో యూరియా పంపిణీ

కుంకలమర్రు (కారంచేడు): రైతులకు అవసరమైన ఎరువులను పోలీస్ బందోబస్తు నడుమ, అదీ అరకొర సరఫరా చేస్తుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుంకలమర్రు గ్రామంలోని సొసైటీ కేంద్రం వద్ద మంగళవారం రైతులకు యూరియా బస్తాలు సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో కేంద్రం వద్దకు రైతులు చేరుకోగా భారీగా పోలీసులను బందోబస్తుగా నియమించి, ఒక్కో రైతుకు కేవలం రెండు యూరియా బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. దీంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుమీద బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయాధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతో 299 మంది రైతులకు 640 బస్తాల యూరియా సరఫరా చేశామని తహసీల్దార్ జి.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎం.నాగరాజు, పోలీస్ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పోలీసు బందోబస్తు నడుమ ఎరువుల పంపిణీ

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీనే నడపాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ చీరాల డిపో అధ్యక్షుడు ఏబీకే రెడ్డి డిమాండ్

చీరాల అర్బన్: ఆర్టీసీలో రాబోతున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ఆర్టీసీనే నిర్వహించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ చీరాల డిపో అధ్యక్షుడు ఏబీకే రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావం సభ మంగళవారం చీరాలలో నిర్వహించారు. సందర్భంగా కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా కార్మికులంతా ఆర్టీసీ రక్షణకు సిద్ధం కావాలన్నారు. ఆర్టీసీలో రద్దీకి అనుగుణంగా నూతన నియామకాలు చేయాలన్నారు. మెరుగైన టిమ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ సీఐటీయూ అనుబంధ సంస్థ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావం తర్వాతనే అనేక ఐక్య ఉద్యమాలు ఆర్టీసీలో జరిగాయని గుర్తు చేశారు. ఆర్టీసీలో ఎస్‌డబ్ల్యూఎఫ్‌ని బలమైన సంఘం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తులసిరావు, రాంబాబు, రామ్మోహనరావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, బాషా, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

ప్రైవేటుకు అప్పగిస్తే ప్రజాఉద్యమం

బాపట్ల మెడికల్ కాలేజీని ప్రైవేటుకు ఇవ్వొద్దు

- అలా చేస్తే నాణ్యమైన వైద్యానికి పేదలు దూరం
- నిర్మాణం పూర్తిచేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలి
- గత ప్రభుత్వ హయాంలో 60 ఎకరాల్లో స్థల సేకరణ, రూ.750 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం చాటుతున్న వామపక్ష, దళిత, ప్రజా సంఘాల నాయకులు

బాపట్ల అర్బన్: మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన చేపట్టడం తగదని, మెడికల్ కాలేజీ సాధన కోసం ప్రజలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు రాజకీయాలకతీతంగా జరిగే పోరాటంలో పాల్గొనాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో బాపట్ల మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలని జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ బాపట్ల ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ పద్ధతికి బదలాయించడం తగదని, ప్రభుత్వమే నిర్మాణ బాధ్యతలు చేపట్టి నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు.

- 2021లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసి, ఇంకా పూర్తి కాని 10 వైద్య కళాశాలల్లో బాపట్ల ఒకటన్నారు. గత ప్రభుత్వ హయాంలో కళాశాలకు అవసరమైన 60 ఎకరాల స్థలం సేకరించారని, రూ.750కోట్ల వ్యయ అంచనాతో నిర్మాణం కోసం మేఘా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్ దక్కించుకుందని, గత ప్రభుత్వ హయాంలో 5శాతం పనులు మొదలయ్యాయన్నారు.
- ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. నిధులు కేటాయింపులు చేయకపోగా ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. బాపట్ల ప్రాంతవాసుల చిరకాల వాంఛగా ఉన్న వైద్య కళాశాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.
- పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులను భాగస్వాములను చేస్తే వైద్య విద్య పేదలకు దూరం అవుతుందని వక్తలు అభిప్రాయపడారు. ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు, గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అత్యవసర వైద్యం కోసం కిలోమీటర్లు దూరంలోని గుంటూరు, విజయవాడ వెళ్లవలసిన తరుణంలో ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు.
- మెడికల్ కాలేజీ సాధన కోసం జరిగే పోరాటాలలో ప్రజలందరూ రాజకీయాలకతీతంగా పాల్గొనాలన్నారు. వైద్య కళాశాల నిర్మాణం పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే యత్నాలను పక్కన బెట్టి రాష్ట్ర ప్రభుత్వమే నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీలు, దళిత ప్రజాసంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు మేకల ప్రసాద్, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు గొర్ల శ్రీనివాసరావు, బీఎస్పీ నాయకుడు జి.రాజారావు దళిత, ప్రజాసంఘాల నాయకులు టి.కృష్ణమోహన్, పి.కొండయ్య, సీహెచ్ మనిలాల్, కె.శరత్, వినయ్ కుమార్, ఆర్ చంద్రశేఖర్, సిహెచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య శిబిరాలు



వైద్యులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ ఎస్.విజయమ్మ

బాపట్ల అర్బన్: స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పీఏ)లో మహిళా ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. మంగళవారం బాపట్ల పట్టణంలో ఏరియా వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేశాయన్నారు. దానిలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆయా వ్యాధులకు సంబంధించి మహిళలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు చేసి వైద్య చికిత్స అందిస్తారని తెలిపారు. అదేవిధంగా గర్భిణులు, కిశోర బాలికలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన చికిత్సలు అందజేయడం జరుగుతుందన్నారు. ఎస్ఎన్ఎస్‌పీఏ స్టేట్ నోడల్ ఆఫీసర్ బి.వి.రావ్, వైద్యులు పాల్గొన్నారు.

తెలుగు గడ్డపై 25వ భారత్ రంగ్ మహోత్సవ్

యడ్లపాడు:అంతర్జాతీయ నాటకోత్సవం 25వ భారత్ రంగ్ మహోత్సవ్-2026 నిర్వహణకు గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదిక కానుంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం 'వేదిక' సంస్థ సంయుక్తంగా చేపడుతున్నాయి. విదేశాలకు చెందిన మూడు నాటకాలు, మన దేశస్తుల రెండు నాటకాలు ఈ కార్యక్రమంలో ప్రదర్శితం కానున్నాయి. ఈ కార్యక్రమం 2026 ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు కొనసాగనుంది. యడ్లపాడులోని వేదిక కార్యాలయంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో వేదిక కార్యవర్గ సభ్యులు, రచయితలు, కళాపరిషత్ నిర్వాహకులు, కళాకారులతో కార్యాచరణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవంలో ప్రతిరోజూ ఒక జాతీయ లేదా అంతర్జాతీయ నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలుగు రాష్ట్రాల కళాకారులు ఇచ్చే విభిన్న కళారూపాల ప్రదర్శనలు ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని అందిస్తాయని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు శరత్ బాబు

ఒంగోలు సబర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎన్‌జీజీఓ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఏపీఎన్‌జీజీఓ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు అధ్యక్షతన ఒంగోలు ఎన్‌జీఓ హోమ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర సంఘం తీసుకోబోయే అన్ని చర్యలకు కట్టుబడి పనిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా బాపట్ల జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, 14 తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాపట్ల జిల్లాకు ప్రకాశం జిల్లా నుంచి వెళ్లిన చీరాల తాలూకా యూనిట్ అధ్యక్షుడు చింతా శేషుబాబు, కార్యదర్శి కొండవీటి శ్రీనివాస రావు, అద్దంకి తాలూకా యూనిట్ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, కార్యదర్శి టి.రమేష్ బాబు, పర్చూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు టి.సుధాకర్, కార్యదర్శి సీహెచ్ పూర్ణచంద్, మాజీ అధ్యక్షుడు కేపీ దాస్, మార్టూరు అధ్యక్షుడు పి.చంద్ర శేఖర్, బాపట్ల జిల్లా ఆడ్‌హాక్ కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్ తదితరులను జిల్లా కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.శివ కుమార్, సహాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి, జిల్లా ఉపాధ్యక్షులు తోట శ్రీనివాసు, పి.రామాంజనేయులు, బి.కృష్ణ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు షేక్ మోమిన్, పి.విజయ్ కుమార్, ఒంగోలు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి మంజీశ్, షేక్ మాస్తుం షరీఫ్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ సీహెచ్ శిరీష, అన్ని తాలుకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘర్షణలో నిందితుడికి రిమాండ్

బల్లికురవ: మండలంలోని వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో జరిగిన ఘర్షణలో నిందితుడికి అద్దంకి కోర్టు మంగళవారం 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వై.నాగరాజు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన ఘర్షణలో నిందితునిగా ఉన్న ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన జాగర్లమూడి వీరాంజనేయులును అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంప దెబ్బ

తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన ఎంఐఎం నాయకుడు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వంతోపాటు కూటమి నేతలు సైతం బలపరిచి చట్టం చేసిన వక్ఫ్ చట్టంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్టే విధించడం కేంద్ర ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తున్నామని తెలిపారు. మధ్యంతర తీర్పులో మూడు కీలక సెక్షన్లపై స్టే విధించిందన్నారు. బోర్డులో ముస్లింమేతరులను చేర్చరాదని, ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే నిబంధన వర్తించదని స్పష్టం చేసిందన్నారు. వక్ఫ్ ప్రాపర్టీ ఖరారు అధికారం కలెక్టర్లకు వర్తించదని, అది ట్రిబ్యునల్‌దేనని కోర్టు పేర్కొందన్నారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ చట్టంపై పిటిషన్ వేసి స్వయంగా వాదనలు వినిపించిన బారిస్టర్ లా అసదుద్దీన్ ఒవైసీ, ముస్లిం పర్సనల్‌లా బోర్డు వారికి మరోక పిటిషన్ వేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేపాల్ బాలిక అదృశ్యం


సరిత కుమారి తాప

లక్ష్మీపురం: నేపాల్‌కు చెందిన బాలిక అదృశ్యమైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన గోవింద్ తాప అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడ హోటల్‌లో పని చేసుకుంటున్నాడు. అయితే ఇటీవల రెండు నెలల క్రితం గోవింద్ తాప కుమార్తె సరిత కుమారి మరి కొంత మందితో కలిసి గుంటూరుకు వచ్చి, గుంటూరులోని రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తుంది. అయితే ఈనెల 14వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. విషయం తెలుసుకున్న తండ్రి గోవింద్ తాప గుంటూరు వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలలో, బంధుమిత్రుల వద్ద ఎంత వెతుకులాడినా ఆచూకీ తెలియక పోవడంతో దిక్కు తోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీసు స్టేషన్ 0863-2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831332, ఎస్ఐ రోజాలత, 8688831334, నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా సూచించారు.

రోడ్లపైనే జంతువుల వధ

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


హార్డ్ కళాశాల ఎదుట మాంసం విక్రయిస్తున్న దృశ్యం

నరసరావుపేటటౌన్: నరసరావుపేట పట్టణంలో బహిరంగంగానే జంతువులను వధిస్తున్నారు. బహిరంగ జంతు వధ నిషేధం అమలులో ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రక్తం, అవశేషాలు, దుర్వాసన వాతావరణాన్ని కలుషితం చేస్తుండగా, కాలుష్య సమస్యలు ఆరోగ్యానికి ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీమార్ట్ పక్కన, హార్డ్ జూనియర్ కళాశాల ఎదుట ప్రతి ఆదివారం పందులను నడిరోడ్లపై యథేచ్ఛగా వధ చేస్తున్నారు. దీంతో పాటు ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ఎదుట గాడిదలను అక్కడే వధ చేసి మాంసం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మాంసం విక్రయాలపై ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. వధ చేసే పరిసరాల చుట్టుపక్కల చెదలు, కుక్కలు చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. రహదారులపై మిగిలిపోయే రక్తం, మాంసపు ముక్కల వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

పలుమార్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా, పెద్దగా చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రతి వారం మాంసం విక్రయదారుల నుంచి మామూళ్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ, శుభ్రతపై నినాదాలు చేస్తూనే.. మరోవైపు బహిరంగ వధలపై పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజారోగ్యంపై దుష్ప్రభావాలు

వధ సమయంలో తగిన శానిటేషన్ లేకపోవడం వల్ల జూనోటిక్ వ్యాధులు (జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులు) వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. జంతువుల రక్తం, అవశేషాలు వల్ల హెపటైటిస్-ఎ, టైఫాయిడ్, కలరా, లెప్టోస్పైరోసిస్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందవచ్చు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు లేకుండా వచ్చిన మాంసం ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీస్తుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలపై ఇవి ఎక్కువగా ప్రభావితం చూపిస్తాయి. కలుషిత మాంసం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, బహిరంగ వధలకు పాల్పడే వారికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

పర్యావరణంపై ప్రభావం..

రక్తం, మాంసపు ముక్కలు వలన దుర్వాసన కాలుష్యం ఏర్పడుతుంది. చెదలు, ఎలుకలు, కుక్కలు చేరి పర్యావరణంలో మలిన వాతావరణం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. వర్షపు నీటితో ఈ మలినాలు కలసి కాలువలు, తాగునీటి వనరులు కలుషితం అవుతాయి. ఈ పరిణామాలు పర్యావరణానికే కాక ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతోపాటు రోడ్ల మీద వధ చూసే పిల్లల్లో భయం, మానసిక ఒత్తిడి కలుగుతుంది. ప్రజల్లో సమాజ శుభ్రతపై నిరాసక్తత పెరుగుతుంది. బహిరంగ వధ ప్రాంతాల్లో నివసించే వారికి సామాజిక అవమానం, జీవన ప్రమాణం తగ్గడం మొదలవుతుంది.

విచారించి చర్యలు తీసుకుంటాం



బహిరంగ జంతు వధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. హార్డ్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలల వద్ద తనిఖీలు చేపట్టి అక్రమంగా జంతు వధకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

–జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్

రెండేళ్ల క్రితం తప్పిపోయిన తల్లి, పిల్లల గుర్తింపు

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


మహిళ, చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు

మంగళగిరి: రెండేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, ఆమె ఇద్దరి పిల్లలను గుర్తించి పట్టుకుని, కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన కట్టా లక్ష్మి అనే మహిళ మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలో నివసించే తన కుమార్తె తోకల తిరుపతమ్మ(23) ఆమె ఇద్దరు పిల్లలు మోక్ష శ్రీనాథ్(5), స్నేహశ్రీ(3)లు కనిపించడం లేదని 2023 ఏప్రిల్ నెలలో మంగళగిరి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త సరిగా చూడడం లేదనే కారణంతో మనస్థాపం చెందిన తిరుపతమ్మ తన పిల్లలతో సహా ఎక్కడికో వెళ్లిపోయిందని తల్లి లక్ష్మి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ వెంకట్‌లు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అనేక ప్రాంతాలలో సమాచారం సేకరించి చివరకు గుంటూరు జిల్లా బుడంపాడులో వున్నట్లు గుర్తించి తిరుపతమ్మను, పిల్లలను మంగళవారం తల్లి లక్ష్మి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కేసును చేధించి తల్లి, పిల్లలను కనుగొన్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో పాటు బృందంలోని సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించినట్లు తెలిపారు.

అనుమానంతో భార్య చేయి నరికిన భర్త

మేడికొండూరు మండలం వెలవర్తిపాడులో ఘటన


తీవ్రంగా గాయపడిన దాసరి రాణి

మేడికొండూరు: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మద్యం మత్తులో కత్తిపీటతో ఆమె చేయి నరికిన ఘటన జరిగింది. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలవర్తిపాడు గ్రామానికి చెందిన దాసరి రాజు నిత్యం మద్యం తాగి వచ్చి తన భార్య దాసరి రాణిపై అనుమానంతో వేధిస్తూ ఉంటాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆమెతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై ఇంట్లో ఉన్న కత్తిపీటతో రాణి కుడిచేతిని నరికేశాడు. రాణి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మేల్కొని సంఘటన స్థలానికి చేరుకున్నారు. అంతలో రాజు నరికిన చేతిని ఒక సంచిలో వేసుకుని, 108 అంబులెన్స్ సహాయంతో బాధితురాలిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించాడు. రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

బైక్‌ను ఢీకొన్న కారు

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

బల్లికురవ: బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో బయట పడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని కొప్పరపాడు, వినుకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డులోని కూకట్లపల్లి యానాది సంఘం వద్ద జరిగింది. ఎస్సై వై.నాగరాజు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని వెలమవారి పాలెం పంచాయతీలోని కె.జమ్ములమడక కాలనీకి చెందిన గద్దల పేతురు (36), నూనె రమేష్ మోటారు బైక్‌పై వినుకొండ వెళ్తున్నారు. ఈ క్రమంలో వినుకొండ నుంచి కొప్పరపాడు వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఇద్దరు తీవ్ర గాయాల పాలవ్వగా స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పేతురు మృతి చెందాడు. రమేష్ సోదరుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,200 గరిష్టం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

పసుపు ధరలు (మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 353


కొమ్ములు : 179 బస్తాలు (ధర రూ॥ల్లో)		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,225	10,000

కాయలు : 174 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,561	10,000

మొత్తం అమ్మకాలు : 264.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	43,052
అమ్మకాలు	42,929
నిల్వ	8,801

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000-14,300
నంబరు-5	10,000-13,400
273	10,500-13,500
341	10,000-15,000
4884	11,500-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,500-14,200
నంబరు-5	10,000-15,800
341	11,000-15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 15,000
బాడిగ-355	10,000 - 16,000
దేవనూరు డీలక్స్	10,500 - 13,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-16,000
దేవనూరు డీలక్స్	10,500-14,300
తాలు	5,200 - 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

దసరా ఉత్సవాలకు దుర్గగుడి ముస్తాబు


ఆలయ ప్రాంగణంలో రంగులు వేస్తున్న కార్మికులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై అమ్మవారి, అయ్యవార్ల ఆలయాలను ఇప్పటికే రంగులతో అందంగా అలంకరించారు. దుర్గగుడి ప్రాంగణంలోని ఉపాలయాలు, ప్రధాన ఆలయం చుట్టూ ఉన్న కారిడార్‌ను ముస్తాబు చేస్తున్నారు. గత ఏడాది దసరా ఉత్సవాలకు ఆలయానికి రంగులు వేయకపోవడంతో భక్తుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది అమ్మవారి ఆలయంతో పాటు ఇతర ఉపాలయాలను రంగులు వేస్తున్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను ఈఓ శీనానాయక్ మంగళవారం పరిశీలించారు. తొలుత ఉత్సవాలకు విచ్చేసే ఇతర ఆలయాల సిబ్బందికి కేటాయించే వసతి గృహాలను తనిఖీచేశారు. సీతానగరంలోని దత్తత ఆలయంలో సిబ్బంది గదులు, భోజన వసతిపై ఆరా తీశారు. అనంతరం ఆలయానికి చేరుకుని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించే పోడియాలు, టికెట్ స్కానింగ్ పాయింట్లు, మీడియా పాయింట్లు, చెప్పుల స్టాండ్, ఓం టర్నింగ్ నుంచి క్యూలైన్లను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వృద్ధుల కోసం బ్యాటరీ వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈఈ కోటేశ్వరరావు, రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఒకరోజు ఆదాయం రూ. 8.64 లక్షలు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ఒక్క రోజే రూ.8,64,198 ఆదాయం వచ్చిందని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. సేవా టిక్కెట్ల ద్వారా రూ.4,56,646, దర్శనం టికెట్ల ద్వారా రూ.20,750, శాశ్వత అన్నదాన నిధికి విరాళాల ద్వారా రూ.2,15,117, నిత్యాన్నదాన నిధికి విరాళాల ద్వారా రూ.62,515, ఇతర మార్గాల ద్వారా 1,09,170 సమకూరిందని పేర్కొన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన
- గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


ప్రిన్సిపల్ ఆఫీసు ముందు బైటాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

రేపల్లె(చెరుకుపల్లి): రేపల్లె పట్టణంలోని అనగాని భగవంతరావు(ఏబీఆర్) డిగ్రీ కళాశాల విద్యార్థి సొంటి రామ్ మల్లేష్ సోమవారం కళాశాల ప్రాంగణంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సహచర విద్యార్థులు గుర్తించి అతనిని ఆస్పత్రికి తరలించారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనకు బాధ్యుడైన గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి వై.నవీన్ మాట్లాడుతూ విద్యార్థి సొంటి రామ్ మల్లేష్ పట్ల గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణ కొంత కాలంగా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. సోమవారం తరగతులకు అనుమతించకుండా వేధింపులకు గురిచేయడంతో పాటు టీసీ ఇచ్చి ఇంటికి పంపుతానని బెదిరించాడని తెలిపారు. చదువుకు దూరం అవుతాననే భయంతో మనస్తాపం చెందిన మల్లేష్ కళాశాల ఆవరణలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ జరిపించి, నారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తిరిగి కళాశాలలో చదువుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. సైన్స్ విభాగానికి కొత్త ఫ్యాకల్టీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సూర్యప్రకాశరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్ప సంపదను అమరావతికి చేర్చాలి

కేంద్ర మంత్రి షెకావత్‌కు డాక్టర్ జాస్తి వినతి


కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

అమరావతి: దేశ, విదేశాలలో ఉన్న అమరావతి ప్రాచీన శిల్ప సంపదను అమరావతి మ్యూజియంకు రప్పించాలని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మంగళవారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి పత్రం సమర్పించారు. ఆయన ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ పరిధిలోని అమరావతి సర్కిల్‌లో 15 నుంచి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని, జెమ్ ద్వారా టెండర్ పిలిచేందుకు చర్యలు తీసుకున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళామన్నారు. పూర్వం శాతవాహనుల రాజధానిగా ఉన్న ధరణికోటలో ఉన్న కేంద్ర పురావస్తు శాఖకు సంబంధించిన 16 ఎకరాల్లో తవ్వకాలు జరిపితే విలువైన శిల్పాలు వెలుగుచూసే అవకాశం ఉందన్నారు. తవ్వకాలు జరిపేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వంతో చర్చించి లండన్ మ్యూజియంలోని అమరావతి శిల్పాలను తిరిగి తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం చెన్నై, ఢిల్లీ, కోల్‌కత్తా, హైదరాబాద్ మ్యూజియంలలో ఉన్న అమరావతికి సంబంధించిన శిల్పాలతోపాటు లండన్ బ్రిటిష్ మ్యూజియంలో అమరావతి గ్యాలరీ నెంబర్ 33ఏలో ఉన్న సుమారు 133 అద్భుతమైన అతి ప్రాచీనమైన కళాఖండాలను అమరావతికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.

సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

చిలకలూరిపేట: సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ -2025 ద్వారా నియామకం అవుతున్న ఉపాధ్యాయులు విధుల్లో చేరకముందే, సీనియర్ ఉపాధ్యాయులకు పాఠశాలల్లో ఉన్న ఖాళీ స్థానాల్లో సర్దుబాటు చేసి, క్లస్టర్ వేకెన్సీలలో కొత్త ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు క్లస్టర్‌లో ఉండి జూనియర్ ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండడం జరిగితే సీనియర్లకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా 2025 డీఎస్సీలో ఎంపికైన ఖాళీలను కూడా ఈ నియామకాల్లోనే భర్తీ చేయాలని, లేనిచో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వివరాలు తీసుకొని పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జూన్ మాసంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగిన తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కూడా విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు అప్పమ్మ మృతి


అప్పమ్మ(103)

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మందపాటి రమేష్‌రెడ్డి తల్లి అప్పమ్మ(103) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణలో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో అప్పమ్మ పాల్గొన్నారు. ఆమెపై నిర్బంధం ఉండడంతో రెండేళ్లపాటు అడవుల్లో అజ్ఞాత జీవితం గడిపారు. అప్పమ్మ భర్త అప్పిరెడ్డి నడికుడి మేజర్ పంచాయతీ సర్పంచిగా పదేళ్లపాటు పనిచేశారు. అప్పమ్మ కోడలు, రమేష్‌రెడ్డి భార్య విజయశ్రీ కూడా నడికుడి సర్పంచిగా ఐదేళ్లపాటు పనిచేశారు. అప్పమ్మకి ఆరుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాసు నివాళి

అప్పమ్మ భౌతికకాయాన్ని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సందర్శించారు. రమేష్‌రెడ్డిని పరామర్శించారు. మిర్యాలగూడెం శాసన సభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, అద్దంకి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌బాబు, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, బుర్రా విజయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పింఛన్ కోసం వచ్చి వ్యక్తి మృతి

- 3వ తేదీ చోటుచేసుకున్న ఘటన
- సంఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి

నరసరావుపేట టౌన్: ఆవు పొడవటంతో తీవ్రంగా గాయపడిన చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకరరావు(69) మూడేళ్లుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం చింతగుంట గ్రామంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. ప్రతి నెలా పింఛన్ తీసుకునేందుకు స్వగ్రామానికి వస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన స్వగ్రామానికి వచ్చి పింఛన్ తీసుకొని కాశినాయన ఆశ్రమానికి బయలుదేరాడు. నరసరావుపేట బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా ఆవు ఒక్కసారిగా వచ్చి పొడిచింది. సంఘటనలో క్రిందపడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు క్షతగాత్రుడిని 108 సహాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం



విమానాశ్రయం(గన్నవరం): విమాన ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేస్తోందని గన్నవరం విమానాశ్రయ డైరెక్టర్ ఎల్.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. స్థానిక విమానాశ్రయ టెర్మినల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన 'యాత్రి సేవ దివస్'లో భాగంగా పౌర విమానయాన శాఖ ఆదేశాల మేరకు విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. విమానయాన సేవలపై విద్యార్థులకు అవగాహన, యువతకు ఎయిర్‌పోర్ట్ ఉద్యోగ అవకాశాలపై కెరీర్ గైడెన్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి థీమ్‌పై విద్యార్థులకు, బాల ప్రయాణికులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు.